క్లుప్తంగా

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోనిఅర్బన్: పట్టణంలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కాలనీలో బుజ్జమ్మ అనే మహిళ 384 టెట్రా ప్యాకెట్లను కలిగి ఉందనే సమాచారం మేరకు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నామని టూటౌన్ సీఐ గోపీచంద్ ఆదివారం తెలిపారు. ఆమెపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించేందుకు కోర్టులో హాజరుపరుస్తున్నట్లు చెప్పారు.

రేపటి నుంచి దేవర

ఆదోనిఅర్బన్: పట్టణశివారు పర్వతాపురంలో మంగళ, బుధవారాల్లో శ్రీ దేవమ్మవ్వ, శ్రీ సుంకులమ్మవ్వ దేవర మహోత్సవం జరగనుందని ఆదివారం గ్రామస్తులు తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి గ్రామ దేవతల రథోత్సవం, బుధవారం కుంభ మహోత్సవం ఉంటుందని చెప్పారు.

ఘనంగా కనకదాసు విగ్రహావిష్కరణ


కనకదాసు విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న చేస్తున్న దృశ్యం

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో ఆదివారం కనకదాసు రాతి విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని కురువ కులస్తులు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక ఆంజనేయస్వామి దేవాలయం నుంచి కనకదాసు విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో కురువ కులపెద్దలు అయ్యన్న, మూకన్న, పూజారి బర్దలింగన్న, భగయ్యగారితాయన్న, భీమన్న, కారప్ప పాల్గొని కనకదాసు యొక్క చరిత్రను వివరించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు


పట్టుబడిన బిందెలు, డ్రమ్ములు, నాటుసారా

పెద్దకబబూరు: మండలంలోని హనుమాపురం గ్రామంలో సారా స్థావరాలపై సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించినట్లు పెద్దకడబూరు ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపారు. ఉదయం హనుమాపురం కొండల్లో పోలీసు సిబ్బందితో కలిసి స్థావరాలపై దాడులు చేపట్టగా 800 లీటర్ల నాటుసారా లభ్యమైందని, అలాగే నాటుసారా తయారు చేసేందుకు ఉపయోగించే పాత్రలను ధ్వంసం చేసి సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

కులగణన సర్వే పూర్తి చేయాలి


కోసిగి సచివాలయం-5 పరిధిలో సర్వే చేస్తున్న దృశ్యం

కోసిగి: కులగణన సర్వే వందశాతం పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మాధవరెడ్డి సూచించారు. ఆదివారం సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పర్యటించి పెండింగ్‌లో ఉన్న కులగణన సర్వే ప్రక్రియ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 17 సచివాలయాల పరిధిలోని 20,776 కుటుంబాలకు గానూ 18,910 కుటుంబాలను సర్వే చేసి 91.01 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. మండలంలో ఎక్కువ కుటుంబాలు వలసలు వెళ్లారని, వారి ఆధార్‌కార్డుకు లింకైన ఫోన్ నంబర్ ఆధారంగా ఓటీపీ ద్వారా ప్రక్రియ పూర్తి చేశామని చెప్పారు. ఆదివారం సెలవు రోజు అయినా సర్వే చేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న వాటిని మరో రెండు రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు చేపట్టామన్నారు.

ముమ్మరంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు


22వ వార్డు సచివాలయంలో రిజిస్ట్రేషన్లు చేస్తున్న సిబ్బంది

ఆదోని సెంట్రల్: గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆదివారం సెలవు దినం అయినా పట్టణంలోని 22వ వార్డు సచివాలయంలో సిబ్బంది ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లను కొనసాగించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్లపై పూర్తి హక్కు కల్పించాలని చర్యలు చేపట్టింది. దీంతో లబ్ధిదారులు ఆధార్ కార్డు, ఇంటి పట్టాతో సచివాలయాల్లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ అయిన పదేళ్ల తరువాత వారు విక్రయించుకునేందుకు అవకాశముంటుందని అధికారులు పేర్కొన్నారు.


రాయచోటి సుబ్బయ్య కాలనీలో, బుడగ జంగాల కాలనీలో వేసిన సీసీ రోడ్డు




రాయచోటి సుబ్బయ్య కాలనీలో జరుగుతున్న రోడ్డు పనులు


శ్రీదేవి ఎస్టేట్ కాలనీలో ఏర్పాటు చేసిన డ్రైనేజీ

అభివృద్ధి పథంలో మండిగిరి

- వైఎస్సార్‌సీపీ పాలనలో ఊపందుకున్న అభివృద్ధి
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత
- రూ.3.60 కోట్లతో పనులు
- ఇప్పటికే 85 శాతం పనులు పూర్తి
- త్వరలో పూర్తి కానున్న మరిన్ని పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఆదోనికి కూత వేటు దూరంలో ఉన్న ప్రాంతాలు కూడా ఐదేళ్ల క్రితం వరకు అభివృద్ధికి దూరంగా నిలిచిపోయాయి. నాటి పాలకుల చిన్నచూపుతో కనీస వసతులకు నోచుకోక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణ సమీపంలోని మండిగిరి మేజర్ పంచాయతీలో అభివృద్ధికి బీజం పడింది. ఐదేళ్లలో గ్రామంలో రూ.3.60 కోట్లతో పనులు జరిగాయి. ప్రధానంగా మౌలిక వసతులు కల్పించడంతో స్థానికులకు అవస్థలు తప్పాయి.

ఆదోనిరూరల్: టీడీపీ హయాంలో అభివృద్ధి ఎక్కడ వేసి గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. గ్రామాలు, పట్టణాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిపోయాయి. దీంతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధి ఊపందుకుంది. పట్టణానికి ఆనుకున్న ఉన్న మేజర్ పంచాయతీ మండిగిరిలో నాలుగున్నరేళ్లలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, మంచి కుళాయిలు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో వసతులు కల్పించి ఇబ్బందులు లేకుండా చేశారు.


మాస్టర్ సీవీవీ నగర్‌లో పూర్తి అయిన సీసీ రోడ్లు

అభివృద్ధి పనుల వివరాలు..

- బాబాగార్డెన్ ప్రాంతంలో రూ.28 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు
- తిరుమలనగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు రూ.60 లక్షలతో పూర్తి చేశారు.
- తిరుమలనగర్ కొట్టాలలో పంచాయతీ గ్రాంట్‌తో సీసీ రోడ్లు, తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు.
- కట్టి ఆంజనేయస్వామి కాలనీ (అమరావతి స్కూల్) ప్రాంతంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పైపులైన్లు రూ.56 లక్షలతో పనులు పూర్తి
- టీచర్స్ కాలనీ, విద్యానగర్ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు రూ.18 లక్షలతో పూర్తి
- శంకరమఠం ప్రాంతంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు రూ.22 లక్షలతో పూర్తి
- రాయచోటి సుబ్బయ్యకాలనీ, శాంతి ఎస్టేట్, శ్రీదేవి ఎస్టేట్, బుడగజంగాల కాలనీ, బీసీ కాలనీ, మునిరత్నం ఎస్టేట్ ప్రాంతాల్లో రూ.90 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు పూర్తయ్యాయి.
- భరత్‌నగర్‌లో డ్రైనేజీలను రూ.32 లక్షలతో ఏర్పాటు చేశారు.

పనులు నాణ్యతగా చేస్తున్నాం



మండిగిరిలో గ్రామ పంచాయతీ నిధులతో నాలుగున్నరేళ్లలో రూ.3.60 కోట్లతో నాణ్యతగా పనులు చేస్తున్నాం. ఇప్పటి వరకు చేసిన పనులన్నీ నిర్దేశించిన సమయంలోనే పూర్తి చేశాం. కొన్ని చోట్ల లేబర్ సమస్య కారణంగా కొంత ఆలస్యమైంది. అయినా 85శాతం పనులు పూర్తి చేశాం. మిగిలినవి త్వరలోనే ముగుస్తాయి.
– చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి


తిరుమలనగర్ కొట్టాలలో పైపులైన్ వేస్తున్న దృశ్యం

- చేపట్టిన పనులు 85 శాతం పూర్తికాగా మిగిలినవి వివిధ దశల్లో జోరుగా సాగుతున్నాయి. త్వరలో వాటిని కూడా పూర్తి చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

సీసీ రోడ్లు లేక ఇబ్బందులుపడ్డాం



మా కాలనీలో సీసీ రోడ్లు లేక అనేక ఇబ్బందులు పడ్డాం. కాలనీ ఏర్పడిన ప్పటి నుంచి మురుగునీరు, వర్షపునీరు రోడ్లపై నిల్వ ఉండి గుంతలు గుంతలుగా మారి దుర్వాసన వెదజల్లుతుండేది. గతంలో టీడీపీ నాయకులు సమస్యను విన్నవించినా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి మా వార్డుల్లో పర్యటించి సమస్యను తెలుసుకొని నాలుగు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి చేయించారు.
– ఉలిగప్ప, బుడగ జంగాల కాలనీ

చీకటి నుంచి వెలుగులోకి వచ్చాం



కొత్తగా ఏర్పడిన భరత్‌నగర్ కాలనీలో కనీసం గరుసు రోడ్డు కూడా లేక పోవడంతో గుంతలు గుంతలుగా ఉండి నీరు నిలిచిపోయేది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. ఈ విషయాన్ని గమనించిన మా పంచాయతీ మాజీ సర్పంచ్ శేషిరెడ్డి గరుసు రోడ్డు వేయించి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సహకారంతో డ్రైనేజీలు, విద్యుత్ లైన్ ఏర్పాటు, వీధిలైట్లు వేయించారు. వీధి లైట్లు వేయడంతో చీకటి నుంచి వెలుగులోకి వచ్చాం.
– వీరేష్, భరత్‌నగర్ కాలనీ

మిగిలిన పనులు త్వరలో పూర్తి చేస్తాం



మండిగిరిలో టీడీపీ ప్రభుత్వం సీసీ రోడ్లు, డ్రైనేజీలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని కోరగా వారు నిధులు మంజూరు చేయించడంతో పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. ఇప్పటికే 85 శాతం పనులు పూర్తయ్యాయి.
– శేషిరెడ్డి, మండిగిరి మాజీ సర్పంచ్

వేడుకగా పామయ్యతాత తిరుణాల

- నేడు బండలాగుడు పోటీలను ప్రారంభించనున్న ఎమ్మెల్యే


తిరుణాలలో భక్తుల సందడి


పామయ్యతాత సమాధి వద్ద పూజలు చేస్తున్న గ్రామ పెద్దలు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో పామయ్యతాత తిరుణాల ఆదివారం ఘనంగా జరిగింది. గురుశిష్యుల బంధానికి ప్రతీకగా, బొమ్మిరెడ్డిపల్లె, నార్లాపురం గ్రామాల మధ్య ఆధ్యాత్మిక అనుబంధంగా ఈ తిరుణాలకు పేరుంది. బొమ్మిరెడ్డిపల్లెకు చెందిన పామయ్యతాత శిష్యుడైన నార్లాపురం పెనికలపాటి హనుమంతయ్య వంశీయుల తొలి నైవేద్యం, తాత వంశీయులైన బొమ్మిరెడ్డిపల్లె వారసుల పూజలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. బొమ్మిరెడ్డిపల్లె, నార్లాపురం, అల్లుగుండు, మల్లెపల్లె, వెల్దుర్తితో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తాత సమాధి వద్ద పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేకాలంకరణ, నందికోలసేవ, చెక్కభజనలతో కనుల పండువగా జరిగింది. తిరుణాల నిర్వాహకులు సర్పంచ్ సునీతారెడ్డి, మధుసూదన్ రెడ్డి దంపతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు చక్రపాణిరెడ్డి, సూర్యనారాయణ, వెంకటేశ్వర్‌రెడ్డి, రంగయ్య, భాస్కర్‌నాయుడు, భాస్కర్ రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

నేడు ఎమ్మెల్యే రాక

పామయ్యతాత తిరుణాల్లో భాగంగా బొమ్మిరెడ్డిపల్లెలో సోమవారం నిర్వహించనున్న ఎడ్ల బండలాగుడు పోటీలను పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9.30లకు జరిగే ఈ పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన వాయిదా

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో రూ. 30 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవన ప్రారంభోత్సవానికి సోమవారం రావాల్సిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పర్యటన వాయిదా పడినట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు రామలింగారెడ్డి ఆదివారం తెలిపారు. ప్రారంభోత్సవ తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గమనించాలని కోరారు.

వైభవంగా వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం


పూజలందుకున్న వాసవీ కన్యకా పరమేశ్వరి


ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న దృశ్యం

ఆదోనిఅర్బన్: పట్టణంలోని నగరేశ్వరస్వామి ఆలయంలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.టి.ప్రకాష్, వేణు మాట్లాడుతూ..ఉదయం నుంచి వాసవీ మాలధారులకు ఇరుముడి కార్యక్రమం, మాడవీధుల్లో అమ్మవారి ఉత్సవమూర్తి ఊరేగింపు, మూలవిరాట్, ఉత్సవమూర్తికి పాలాభిషేకం, కుంకుమార్చనలు, వాసవీ హోమం, పూర్ణాహుతి చేపట్టామన్నారు. అలాగే 108 కలశాలతో ముత్తైదువులతో ఊరేగింపు, అమ్మవారికి పల్లకీ సేవ వాసవీ హోమం, సామూహిక కుంకుమార్చన, మహిళా మండలి ఆధ్వర్యంలో మహా మంగళహారతి, మధ్యాహ్నం అన్నదానం జరిపించారు. సంఘం సభ్యులు టి.జి.రాంప్రసాద్, సంఘం సభ్యులు, మహిళా మండలి ప్రెసిడెంట్ మిరియాల సరస్వతి, సెక్రటరీ వి.త్రివేణి, ట్రెజరర్ కొత్రా పుష్పలత పాల్గొన్నారు.

శాంతి మార్గమే ప్రపంచానికి ఆదర్శం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పీఠాధిపతులు

కౌతాళం: శాంతి మార్గమే ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుందని పాల్తూరు మఠం పీఠాధిపతి చెన్నవీర శివచార్య సాములు, హాల్వి మఠం పీఠాధిపతి మహాంతస్వామి, రౌడూకుంద మఠం పీఠాధిపతి శివయోగి మహాస్వాములు పేర్కొన్నారు. మండల కేంద్రంలో భక్తుల విరాళాలతో నూతనంగా నిర్మించిన త్రైంబకేశ్వర స్వామి ఆలయాన్ని ఈనెల 22వ తేదీన ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి నుంచి 11రోజుల పాటు 21వ తేదీ వరకు బసవేశ్వరస్వామి పురాణ ప్రవచన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అధ్యాత్మిక కార్యక్రమాల వల్ల గ్రామాల్లో శాంతి, సోదరభావం ఏర్పడుతుందన్నారు. పురాతన దేవాలయ స్థానంలో నూతన ఆలయాన్ని గ్రామస్తులంతా కలిసికట్టుగా విరాళాలు సేకరించి నిర్మించడం గొప్ప విషయమన్నారు. 22న ఆలయ ప్రారంభోత్సవం ఉంటుందని కమిటీ నిర్వహకులు తెలిపారు. అలాగే ప్రత్యేక హోమాలు, విశేష పూజల అనంతరం గణపతి, త్రైంబకేశ్వరస్వామి, పార్వతి దేవుళ్ల విగ్రహాలతో పాటు వివిధ దేవతల విగ్రహాల ప్రతిష్ఠోత్సవం జరిపిస్తామని చెప్పారు.

ఘనంగా భీరప్పస్వామి దేవర


పల్లకీపై ఊరేగుతున్న భీరప్పస్వామి

గోనెగండ్ల: మండల కేంద్రంలో భీరప్పస్వామి దేవర ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం తుంగభద్ర దిగువ కాలువ దగ్గర ఉన్న కాశీవిశ్వేర దేవాలయం నుంచి భీరప్పస్వామి వారి పల్లకి ఉత్సవం సాగింది. ఈ సందర్భంగా గొరవయ్యాల నృత్యం, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు హాజరై స్వామివారికి పూజలు చేశారు. అలాగే సోమవారం ఉదయం హోమం, గొరవయ్యాల పూజలు తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ పూజారులు తెలిపారు.

ప్రహరీ గోడ నిర్మాణానికి విరాళం


విరాళం ఇస్తున్న బుసినె విరుపాక్షి

చిప్పగిరి: సంగాల గ్రామంలోని సుంకులమ్మ అవ్వ దేవాలయం ప్రహరీ గోడ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినే విరుపాక్షి ఆదివారం రూ.50 వేల విరాళం అందించారు. ఆయనకు గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచి ప్రేమ్ కుమార్, పార్టీ నేత మారయ్య తదితరులు ఉన్నారు.

డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న విరుపాక్షి

చిప్పగిరి: మండలంలోని నేమకల్లు పంచాయతీ మజార గ్రామమైన సంగాలలో రూ.10 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ కాలువ పనులను వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినే విరుపాక్షి ఆదివారం భూమి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం నేమకల్లు, సంగాల గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మారయ్య, సర్పంచ్ ప్రేమ్ కుమార్, ఎంపీటీసీ సభ్యులు సుంకన్న, భీమలింగ, నాగేంద్ర, సత్తిరెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్

మద్దికెర: మద్దికెర గ్రామంలో ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ ఇస్తామని.. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సుహాసిని తెలిపారు. నీటి సమస్యతో ఎవరూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఉచితంగా నీటి కనెక్షన్ ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అయితే 2023-24 ఏడాదికి సంబంధించి ఇంటి పన్ను పూర్తి స్థాయిలో చెల్లించి ఉండాలన్నారు. వివరాల కోసం పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

శరవేగంగా ప్రభుత్వ భవన నిర్మాణాలు


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సచివాలయం


చివరి దశలో రైతు భరోసా కేంద్ర పనులు

నందవరం: మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో ప్రభుత్వ భవన నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామ సచివాలయం, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్ పనులను పీఆర్ అధికారులు వేగవంతం చేశారు. ప్రభుత్వం భవన నిర్మాణాలకు సంబంధించి బిల్లులు పూర్తిగా చెల్లించడంతో పనులు ఊపందుకున్నాయి. ప్రభుత్వం ఒక్కో గ్రామ సచివాలయానికి రూ.40 లక్షలు, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రానికి(ఆర్బీకే) రూ.21.80 లక్షలు, హెల్త్ క్లినిక్ సెంటర్‌కు రూ.17.18 లక్షలు నిధులు మంజూరు చేసింది. గ్రామ సచివాలయం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. రైతు భరోసా కేంద్రం ఈనెలాఖరుకు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

ఒత్తిడిని జయిస్తే విజయం మీదే

కర్నూలు(అర్బన్): పరీక్షల్లో ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఉంటే విజయం మన సొంతమవుతుందని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి డా.ఎ. సునీల్ కన్నా అన్నారు. ఆదివారం ఆయన స్థానిక గడియారం ఆసుపత్రి సమీపంలోని మైనార్టీ సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు ఎలా సంసిద్ధులు కావాలనే అంశంపై వివరించారు. అలాగే పదవ తరగతి అనంతరం ఇంటర్, డిగ్రీలో తీసుకోవాల్సిన గ్రూపులు, వాటి ఉపయోగాల గురించి వివరించారు. ముఖ్యంగా విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ దిశగా కష్టపడి చదవాలన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా, వసతి దీవెన ద్వారా ఆర్థిక సహకారం అందిస్తోందని, అలాగే జగనన్న విదేశీ విద్యా దీవెన ద్వారా ఇతర దేశాల్లో చదువుకునేందుకు కూడా ప్రోత్సాహం అందిస్తోందన్నారు.

జాతరకు ముమ్మర ఏర్పాట్లు


తేరుబజారులో ముళ్లకంపలను తొలగిస్తున్న నిర్వాహకులు

హొళగుంద: మండల కేంద్రంలో ఈ నెల 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే హొళగుంద సిద్దేశ్వరస్వామి జాతరకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు.. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ చలవాది రంగమ్మ తెలిపారు. ఆదివారం స్థానిక తేరుబజారులో ముళ్లకంపలు, పిచ్చిమొక్కల తొలగింపు పనులు చేపట్టారు. రథోత్సవం, లంకా దహనం తదితర కార్యక్రమాలను భక్తులు తిలకించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించకుండా భక్తులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు.

మాజీ సైనికోద్యోగులకు సన్మానం

పత్తికొండ రూరల్: పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో గ్రామానికి చెందిన రిటైర్డు సైనికోద్యోగులు సురేష్‌బాబు, నరసింహులుయాదవ్, మల్లికార్జునయ్య, వీరశేఖర్‌స్వామిలను బీజేపీ నాయకులు సన్మానించారు. పార్టీ నాయకులు పూనామల్లికార్జున, పాల్గొన్నారు.

నేడు శ్రీమార్కండేయ స్వామి జయంతి


ప్రత్యేక అలంకరణలో మార్కండేయ స్వామి


హోమంలో పాల్గొన్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో మార్కండేయస్వామి

కోసిగి: మండల కేంద్రంలో పద్మశాలి కుల బాంధవుల ఆరాధ్య దైవం శ్రీ భక్త మార్కండేయ స్వామి జయంతి వేడుకలను సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త వై. ఆంజనేయులు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ స్వామి వారి జయంతిని పురస్కరించుకుని వేకువ జాము నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండి కవచ, ఫల,పుష్పాలతో అలంకరించి విశేష పూజలు చేపడతామని చెప్పారు.

మార్కండేయస్వామికి ప్రత్యేక పూజలు

ఆదోనిఅర్బన్: మార్కండేయస్వామి జయంతి సందర్భంగా స్థానిక చిన్నమార్కెట్‌లో వెలిసిన మార్కండేయస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో మొదటిరోజు స్వామివారికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, విఘ్నేశ్వర పూజ, కలశ స్థాపన, హోమాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం తుంగభద్ర నుంచి తీసుకొచ్చిన జలాలతో ఊరేగింపు నిర్వహించారు. సోమవారం తుంగభద్ర జలాలతో స్వామివారికి అభిషేకం, సహస్ర నామ కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేపడతారు. సాయంత్రం ప్రధాన రహదారుల్లో రథోత్సవం ఉంటుందని సంఘం అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మన్న, దేవిరెడ్డి రామకృష్ణ తెలిపారు.